S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 41 | సంచిక: 178 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 6 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# ఉత్తరాంధ్ర ఉషోదయం

■ విశాఖ రైల్వే జోన్ సాకార స్వప్నం! ■ విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల

## రాయగడ కేంద్రంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏర్పాటు

## రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ ■ సీఎం చంద్రబాబు హర్షం

## చిరకాల స్వప్నం నెరవేరిందని ఎక్స్‌లో పోస్ట్



## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా

# కల్పించాలి



- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

2వ పేజీలో



2

# సాహసానికి సలాం

ప్రాణాలకు తెగించి చైన్‌స్నాచర్‌ను పట్టుకున్న ఆటో డ్రైవర్



# నైపుణ్యం ఉంటేనే ఉపాధి

- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్
- సీఎం రేవంత్ రెడ్డితో భేటీ
- తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై కీలక చర్చ
- ఏఐ సిలబస్‌పై కమిటీ..
- స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై రాజన్ ప్రశంసలు

**తెలంగాణ భవిష్యత్తు ప్రణాళిక, పారిశ్రామికాభివృద్ధిపై రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ రాష్ట్ర ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ కల్పన, విద్యా వ్యవస్థలో మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు.**

**హైదరాబాద్, మే 5:** యువత తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం వంటి ప్రాథమిక సమస్యలను అధిగమించాలని ఆయన సూచించారు. ప్రభుత్వాలు అనుసరించే సులభతర వ్యాపార విధానం పైనే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆధారపడి ఉంటాయని రాజన్ అభిప్రాయపడ్డారు. కేవలం పెద్ద పరిశ్రమలే కాకుండా స్టార్టప్‌లను విరివిగా ప్రోత్సహించాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని సరైన పద్ధతిలో వినియోగిస్తే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి వైద్య విద్య వరకు సిలబస్‌లో ఏఐ వినియోగంపై ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, దానికి తగిన సలహాలు ఇవ్వాలని రాజన్ ను కోరారు.

మిగతా 2 లో




# పంట మార్పిడిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

**సీఎంకు నివేదిక సమర్పించిన రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

**సాగులో మార్పులు రావాలి.. రైతుల ఆదాయం పెరగాలి: సీఎం**

రాష్ట్రంలో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా అత్యంత కీలకమైన 'పంట మార్పిడి' అంశంపై శాసనసభలో ప్రత్యేక చర్చ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

వివరాలు 2వ పేజీలో



## 1.52 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలకు గ్రీన్ సిగ్నల్

- లక్ష్యం 'వికసిత భారత్'..
- మార్గం మౌలిక సదుపాయాల కల్పన
- కేంద్ర క్యాబినెట్ భారీ నిర్ణయాలు

## తల్లి ఒడి నుంచి చిన్నారి కిడ్నాప్



2

# అక్రమ మైనింగ్‌పై 'హైడ్రా' పంజా

- ఒకేరోజు 18 ప్లాంట్లు నేలమట్టం!
- గండిపేట, శేరిలింగంపల్లి, శంషాబాద్ పరిధిలో భారీ కూల్చివేతలు
- వందల కోట్ల ఆదాయానికి గండి..
- బడాబాబుల అండ ఉన్నా వదలని అధికారులు

2





# ఇన్‌స్టా 'వల'

## 19 మంది మైనర్ల విలవిల!

- జూబ్లీహిల్స్ ట్రాప్ కేసులో సంచలనాలు
- అన్నదమ్ముల కామాంధ పర్వం

2

# నేను ఓడిపోలేదు రాజీనామా చేయను



- బెంగాల్లో బీజేపీ కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్
- మమతా బెనర్జీ వ్యాఖ్యలు

4

## ఇది జనాదేశం కాదు.. ఓట్ల దొంగతనం

- రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- బెంగాల్, అస్సాం ఫలితాలపై విపక్ష నేత ధ్వజం
- టీఎంసీ ఓటమిపై కాంగ్రెస్ సంబరాలపై ఆగ్రహం

4





# నైపుణ్యం ఉంటేనే ఉపాధి

మొదటి పేజీ తరువాయి

అలాగే మిడిల్ లెవల్ ఉద్యోగాల కోసం స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు కావాల్సిన భూమి, విద్యుత్, మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి 'క్యూర్, ప్యూర్, రేర్' మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. యువతలో నైపుణ్యాల పెంపు కోసం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామని, ఐటీఐలను ఏటీసీలుగా మార్చి శిక్షణ ఇస్తున్నామని రాజన్ కు వివరించారు. తెలంగాణలో ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల ఏర్పాటుకు అత్యుత్తమ వాతావరణం ఉందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సులభతర వ్యాపారానికి అనుగుణంగా అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. డేటా సెంటర్ల నిర్వహణకు నీరు, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానికి అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని రాజన్ సూచించారు. రాబోయే మూడు నాలుగు నెలల్లో తాను హైదరాబాద్ పర్యటనకు వస్తానని రఘురామ్ రాజన్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంట మార్పిడిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

**సీఎంకు నివేదిక సమర్పించిన రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి**

**సాగులో మార్పులు రావాలి.. రైతుల ఆదాయం పెరగాలి: సీఎం**



**హైదరాబాద్, మే 5:** రాష్ట్రంలో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా అత్యంత కీలకమైన 'పంట మార్పిడి' అంశంపై శాసనసభలో ప్రత్యేక చర్చ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంట మార్పిడిపై కమిషన్ రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. పంట మార్పిడి అంశంపై ప్రభుత్వం త్వరలోనే లోతైన చర్చ జరపాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు మేలు జరిగేలా నిర్మాణాత్మక సూచనలతో ముందుకు రావాలని రైతు కమిషన్‌ను ఆయన కోరారు. "సాగు విధానాల్లో మార్పులు రావడం ద్వారానే రైతుల ఆదాయం పెరుగుతుంది. భూసారం దెబ్బతినకుండా, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు వేయడంపై రైతులకు అవగాహన కల్పించాలి" అని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే సవాళ్లపై అసెంబ్లీలో చర్చించడం ద్వారా ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించవచ్చని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రైతులకు మరింత మేలైన సాగు పద్ధతులను అందుబాటులోకి తీసుకువస్తామని, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# తల్లి ఒడి ఉంచి  చిన్నారి కిడ్నాప్

**హైదరాబాద్, మే 5:** హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పక్కన అర్ధరాత్రి తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న మార్బుల్ షాపు వద్ద ఆదివారం అర్ధరాత్రి నవనీత అనే మహిళ తన నలుగురు పిల్లలతో నిద్రిస్తున్నది. తల్లి నిద్రలో ఉన్న సమయంలో ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి ఆశను ఎవరో దుండగులు ఎత్తుకెళ్లారు. కాసేపటికి మెలకువ వచ్చిన నవనీత చుట్టుపక్కల వెతకగా పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. వెంటనే కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

# హైడ్రా భారీ కూల్చివేత

**ఆరుచోట్ల అక్రమ మైనింగ్ ప్లాంట్లపై చర్యలు**

**హైదరాబాద్, మే 5:** హైదరాబాద్‌లో అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్లు, ప్లాంట్లపై హైడ్రా కఠిన చర్యలు చేపట్టింది. ఒక్క రోజులోనే 6 ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్లు నిర్వహించి, అక్రమ యూనిట్లపై దాడులు చేసి కూల్చివేతలు చేపట్టింది. గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి విలేజ్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో హైడ్రా బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 6 క్రషింగ్ యూనిట్లను తొలగించగా, 12 ఆర్ఎంసి  ప్లాంట్లను కూల్చివేశారు. పీసీబీ, మైనింగ్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. సంబంధిత శాఖల ఆధ్వర్యంలోనే కూల్చివేతలు జరిగాయి. అక్రమ మైనింగ్, క్రషింగ్, ఆర్ఎమ్‌సీ ప్లాంట్లతో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి అక్రమ యూనిట్లు గండికొడుతున్న పరిస్థితి. బడాబాబుల అండతో మైనింగ్, క్రషింగ్, ఆర్ఎంసి ప్లాంట్లు నడుస్తున్నట్లు సమాచారం. బడాబాబుల పైరవీలతో నడుస్తున్న యూనిట్లపై ఆయా శాఖల ఫిర్యాదులతో హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

**రాజన్న సిరిసిల్ల, మే 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోట లో బయోస్ట్రాట్రమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమి టేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జ రిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలం గాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జా తీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర  ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం



తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు ఆనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నా రు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్  పడిపో తున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# సాహసానికి సలాం

- ప్రాణాలకు తెగించి చైన్‌స్నాచర్‌ను పట్టుకున్న ఆటో డ్రైవర్
- జాహెర్‌ను సన్మానించిన సీపీ సజ్జనార్

**హైదరాబాద్, మే 5:** ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కత్రతో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జీన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు



సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌ఓ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టా 'వల'

## 19 మంది మైనర్ల విలవిల!




**జూబ్లీహిల్స్ ట్రాప్ కేసులో సంచలనాలు**

**అన్నదమ్ముల కామాంధ పర్వం**

**ఖరీదైన కార్లు, రీల్స్‌తో ఎర..**

**తల్లి, మేనమామలకూ భాగస్వామ్యం**

**హైదరాబాద్, మే 5:** జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు.రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్మార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు



ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# కరీంనగర్ బంగారం షాపు చోరీ

**ధర్మపురి లాడ్జిలో దొంగల బస**

**సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించే పని**



**కరీంనగర్, మే 5:** కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న ప్రైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల మీదుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. మే 3వ తేదీన కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెలరీ షాపులో భారీగా బంగారం చోరీ జరిగింది. బైక్‌లపై సాధారణ కస్టమర్లలాగా వచ్చిన ఐదుగురు నిందితులు.. షాపులో క్షణాల్లో బీభత్సం సృష్టించారు. తుపాకులతో సిబ్బందిని బెదిరించడంతో పాటు.. వారిపై కాల్పులు జరిపారు. దీంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిని పట్టించిన వారికి నగదు బహుమతిగా ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత



- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- అధికారులతో సమీక్షలో సీఎస్

**హైదరాబాద్, మే 5:** ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లు భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి, ÷ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చురుకుగా రబీ ధాన్యం సేకరణ

- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి
- ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి
- నల్లగొండలో ఆకస్మికి పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర



**నల్లగొండ, మే 5:** రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు,టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శు భ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్దార్థ రైస్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉ న్నారని తెలిపారు. ఆన్ లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అన్‌లోడింగ్, ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జి ఎం. రాంపతి నాయక్, డిసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.



# బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

**కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు తొక్కి పెట్టారు**

**వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి**

**హనుమకొండ, మే 5:** బీఆర్ఎస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'రైతులకు ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

**రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం**

**నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం**

**ప్రభుత్వాన్ని హెచ్చరించిన కేటీఆర్**



**జనగామ, మే 5:** రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# బీసీలను పట్టించుకోని కేంద్రం

**9న ఆమరణ దీక్ష చేపడతానన్న వీహెచ్**



**హైదరాబాద్, మే 5:** బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. 'బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా' అని స్పష్టం చేసిన వీహెచ్.. బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

## ఇచ్చిన హామీలకు, పాలనకు
# పొంతన లేదు

**కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం**

**గజ్వేల్ బీజేపీ సభలో ఈటల రాజేందర్ వ్యాఖ్య**

**సిద్దిపేట, మే 5:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వేస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మన:శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ నేతల సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. రిటైర్ ఉ ద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు.దీనిపై లోతుగా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా, ఎంత షార్ప్‌గా ఉన్నారో ఈ ఫలితాలను బట్టి మనకు అర్థమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.



## కాళేశ్వరంపై సీబీఐ విచారణ
# ఎందుకు చేయరు

**బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనం**

**కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్**



**హైదరాబాద్, మే 5:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు. బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి? అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో అలాంటి ఆటలు సాగవన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.




## సంపాదకీయం

# ప్రజల ఆకాంక్షలను బీజేపీ గౌరవించాలి!

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బీజేపీ ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బీజేపీ రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బీజేపీ హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్యం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవులు సద్దుమణగవు. ఒక్కొకక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బీజేపీ పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు.భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బీజేపీ ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బీజేపీ కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బీజేపీ గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బీజేపీ పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బీజేపీని మ-రోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

# నేను ఓడిపోలేదు.. రాజీనామా చేయను

- బెంగాల్లో బీజేపీ కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్
- మమతా బెనర్జీ వ్యాఖ్యలు



కోల్‌కతా, మే 5: పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం మమతాబెనర్జీ మాట్లాడుతూ.. ఈసీ, బీజేపీపై ఘాటు విమర్శలు చేశారు. బీజేపీ కనుసన్నల్లో ఈసీ పనిచేసిందన్నారు. అమిత్‌షా, ప్రధాని మోడీ కలసి కుట్రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.




# బెంగాల్, అసోంలో ఓట్ చోరీ

### జనాదేశాశ్‌ను చోరీచేసిన బీజేపీ

### మరోమారు రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే5:** బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బెంగాల్, అసోంకు బీజేపీ పరిశీలకుల నియామకం

### అమిత్ షా, జేపీ నడ్డాలకు పార్టీ బాధ్యతలు

న్యూఢిల్లీ, మే 5: పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాల ఏర్పాటుకు బిజెపి రంగం సిద్దం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బీజేపీ అధిష్టానం నియమించింది. అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝిని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు. అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.



# 1.52 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలకు గ్రీన్ సిగ్నల్

### లక్ష్యం 'వికసిత భారత్'..

### మార్గం మౌలిక సదుపాయాల కల్పన

### కేంద్ర క్యాబినెట్ భారీ నిర్ణయాలు

**న్యూఢిల్లీ, మే 5:** దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ.లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ.868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ.16,403 కోట్లు, గుంతకల్ - వాడిలైన్ నిర్మాణానికి రూ.4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ.2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎంఎస్ఎంఈలకు మద్దతునిచ్చేలా ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.






# ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్

**న్యూఢిల్లీ, మే 5:** భారతీయ ఇలుస్ట్రేటర్ ఆనంద్ ఆర్‌కే, జర్నలిస్టు సుపర్ణ శర్మ.. 2026 పులిట్జర్ అవార్డును గెలుచుకున్నారు. ఇలుస్ట్రేటెడ్ రిపోర్టింగ్ అండ్ కామెంటరీ విభాగంలో వాళ్లు ఈ అవార్డు చేజిక్కించుకున్నారు. ట్రాప్డ్ అనే కథనం కోసం ఆ ఇద్దరు జర్నలిస్టులతో కలిసి నాటాలీ ఒబికో పియర్సన్ కూడా పనిచేశారు. ఈ ముగ్గురూ అవార్డును షేర్ చేసుకున్నారు. డిజిటల్ అరెస్టుకు చెందిన కథనాన్ని చాలా సునిశితంగా ప్రజెంట్ చేశారు. చాలా బలమైన విజువల్స్‌తో ఆ కథనాన్ని ప్రసారం చేశారు. దక్షిణాసియాలో సైబర్ నేరగాళ్ల ముఠా ఎలా పనిచేస్తుందన్న కోణంలో ట్రాప్డ్ కథనంలో చూపించారు. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పులిట్జర్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఎలా ఓ భారతీయ న్యూరాలజిస్టును బోల్తా కొట్టిస్తారో ట్రాప్డ్ స్టోరీలో ప్రజెంట్ చేశారు. ఇన్వెస్టిగేట్ జర్నలిజం విధానంలో ఈ కథనం సాగుతుంది. కథనంలో ఎడిటోరియల్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు పులిట్జర్ బోర్డు ప్రశంసించింది. ట్రాప్డ్ ప్రాజెక్టు కోసం ముంబై ఆర్టిస్టు ఆనంద్ ఆర్కే బొమ్మలను గీశారు. గ్రాఫిక్ స్టోరీటెల్లింగ్‌లో అతను మాస్టర్. గతంలో ఆయన 2021లో ఈస్నర్ అవార్డు గెలుచుకున్నారు. బ్లూ ఇన్ గ్రీన్ అనే గ్రాఫిక్ నవలకు ఆ అవార్డు వచ్చింది. ఇక జర్నలిస్టు సుపర్ణ శర్మ ఈ కథనానికి రిపోర్టింగ్ చేశారు. బ్లూమ్‌బర్గ్‌కు చెందిన టోక్యో రిపోర్టర్ నటాలీ ఒబికో పియర్సన్ కూడా ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ చేశారు. అంతర్జాతీయ రిపోర్టింగ్ కేటగిరీలో మరో భారతీయ జర్నలిస్టు అనిరుద్ధ్ ఘోసల్ పులిట్జర్ ప్రైజ్ గెలిచారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులకు చెందిన నిఘా వ్యవస్థల టెక్నాలజీ గురించి ఇన్వెస్టిగేట్ చేశారు.

# ఐపీఎస్ విశాల్ గున్నికి హైకోర్టు షాక్

## క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ ఆదేశం

## తదుపరి విచారణ ఆగస్ట్ 29కి వాయిదా

**అమరావతి, మే 5:** ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులపై స్టే విధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సినీ నటి కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే విశాల్ గున్ని సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకుని పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 28వ తేదీన క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. డీజీపీ, సీఎస్ తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దాని కారణంగా విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక, విశాల్ గున్ని తరుపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరు వర్గల వాదనలు విన్న అనంతరం క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. కేసుపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది.

# ఆకివీడు రామాలయం కేసు

## పిటిషన్‌ను కొట్టి వేసిన ఏపీ హైకోర్టు

**అమరావతి, మే 5:** పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే గత 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలించిన తరువాత జిల్లా కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ రామాలయం నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో రామాలయం నిర్మాణాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ జరిపిన అనంతరం.. దీనిపై ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్‌లో రిట్ పిటిషన్లు ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని తెలిపింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని హైకోర్టు చెప్పగా.. డిస్పోజ్ చేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీంతో ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్పోజ్ చేసింది. అంతేకాకుండా పిల్‌ను ఉపసంహకరించుకున్నట్లు పిటిషనర్ల న్యాయవాది తెలిపారు. తాజాగా ఆలయ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. అన్నింటినీ పరిశీలించాకే కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ అనుమతులు ఇచ్చారని పేర్కొంటూ.. పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

# ఐఏఎస్ అహ్మద్ బాబుకు హైకోర్టులో చుక్కెదరు

## ఉద్యోగ సంఘాల పిటిషన్ కొట్టేసేందుకు తిరస్కరణ

**అమరావతి, మే 5:** ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఉద్యోగుల సంఘం చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశించింది. ఐఏఎస్ అహ్మద్ అనర్హుడంటూ హైకోర్టులో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ కొనసాగుతుండగా.. పిటిషన్‌ను కొట్టివేయాలని అహ్మద్ బాబు అప్పీల్ చేసుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం పిటిషన్‌పై విచారణ జరిపి.. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఉద్యోగుల సంఘం ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గత కొన్ని రోజులుగా అహ్మద్ బాబుకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అన్ని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయాల ముందు మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. చాలా మంది ఉద్యోగుల ప్రమోషన్లను అహ్మద్ తొక్కిపెడుతున్నారంటూ ఉద్యోగ సంఘాలు ఆరోపించాయి. దీనికి సంబంధించి సోమవారం అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశమై.. కోర్టు ఆదేశాలను పాటించాలని, ప్రమోషన్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తరుణంలో అహ్మద్ బాబు అప్పీల్‌కు వెళ్లడంతో హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖతో పాటు అహ్మద్ బాబు నిర్వహిస్తున్న శాఖల్లో ఏదీ సవ్యంగా లేనట్లు కనిపిస్తోందని సింగిల్ జడ్జి చేసిన అబ్జర్వేషన్ ను ధర్మాసనం పక్కనపెట్టింది. ఉద్యోగ సంఘం వినతిని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది.

# పాస్టర్లకు ఎస్సీ కుల ధృవీకరణ

## హైకోర్టులో విచారణ..జూలై 6కు విచారణ వాయిదా

**అమరావతి, మే 5:** సరైన విచారణ జరపకుండా పాస్టర్లకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం జులై 6వ తేదీకి ఈ కేసు విచారణను వాయిదా వేసింది. చర్చిల్లోని పాస్టర్లకు జారీ చేసిన ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని హైకోర్టులో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిరెడ్డి ప్రసన్న కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. పాస్టర్లకు జారీ చేసిన ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రసన్న కుమార్ పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిటిషన్‌లో ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. దీనిపై ఈ రోజు విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. జులై ఆరో తేదీకి ఈ కేసును వాయిదా వేసింది.




# ఉత్తరాంధ్ర ఉషోదయం



**విశాఖపట్టణం, మే 5:** విశాఖపట్టణం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ గెజిట్‌ను కేంద్ర రైల్వే బోర్డు అధికారికంగా విడుదల చేసింది. జూన్ 1, 2026 నుంచి దక్షిణ కోస్తా రైల్వేను అధికారికంగా ప్రారంభించనుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో రాయగడ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటైంది. వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖపట్టణం, రాయగడ డివిజన్లుగా మార్పు చేసింది. దక్షిణ కోస్తా, ఈస్ట్ కోస్ట్, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలో కీలక మార్పులు చేసింది. పాత వాల్తేరు డివిజన్‌లోని విశాఖ నగరం సహా పరిసర ప్రాంతాలు ఇకపై విశాఖపట్టణం డివిజన్‌గా మార్చింది. రాయగడ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే కింద పనిచేస్తుందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. దక్షిణ కోస్తా రైల్వే పరిధి కొత్త జోన్ పరిధిలోకి గుంతకల్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం డివిజన్లను ఏర్పాటుచేసింది. ఇకపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉంటాయని తెలిపింది. ఖుర్దా రోడ్ డివిజన్‌లో గల 'ఇచ్ఛాపురం నుంచి పలాస' వరకు గల మార్గాన్ని విశాఖపట్టణం డివిజన్‌కు బదిలీ చేసింది. గుంతకల్ డివిజన్ నుంచి 'రాయచూర్-వాడి సెక్షన్' సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. పగిడిపల్లి-విష్ణుపురం మార్గాన్ని.. గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు మార్పు చేసింది. కొండపల్లి-మోటుమర్రి మార్గాన్ని సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ చేసింది. రాయగడ, విశాఖపట్టణం డివిజన్ల మధ్య సింగపూర్ రోడ్ - విజయనగరం కొత్త సరిహద్దు ఖరారు చేసింది. సౌత్ పోస్ట్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ల మధ్య స్పష్టమైన సరిహద్దు కిలోమీటర్లను గెజిట్‌లో రైల్వే బోర్డు వెల్లడించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

## చిరకాల స్వప్నం నెరవేరిందని ఎక్స్‌లో పోస్ట్

**అమరావతి, మే 5:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు చెప్పారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస - ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుంటే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు రాష్ట్ర ప్రగతిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అన్నారు. కొత్త రైల్వేజోన్‌తో రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. రాయగడ డివిజన్ పరిధిలోకి కేకేలైన్ వెళ్లినా ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు

# ట్రాన్స్‌జెండర్ సమస్యలపై మహిళా కమిషన్ దృష్టి

## సమగ్ర చర్యలకు శ్రీకారం.. స్వాభిమాన సభలో నేరుగా సమస్యల సేకరణ

## మంగళగిరిలో ప్రతినిధులతో విస్తృత చర్చలు

## గౌరవప్రద జీవనం, సమాన అవకాశాలపై ప్రణాళికలు

**విజయవాడ, మే 5:** ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ప్రత్యేక దృష్టి సారించారు. గత కొన్ని నెలలుగా ఈ వర్గం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేస్తూ, వాటికి శాశ్వత పరిష్కారాల కోసం చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఏప్రిల్ 7న విజయవాడలో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్స్ స్వాభిమాన సభలో పాల్గొన్న శైలజ, ట్రాన్స్‌జెండర్ సమాజ ప్రతినిధులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, నివాస సౌకర్యాలు వంటి అనేక అంశాలు తమకు సవాళ్లుగా ఉన్నాయని ప్రతినిధులు వివరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులతో మరోసారి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సమస్యలను విభాగాల వారీగా గుర్తించి, వాటిని ప్రభుత్వానికి సమగ్ర నివేదిక రూపంలో అందించే విధానంపై చర్చించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకునే అంశంపై కూడా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేశారు. సమాన అవకాశాలు అందించకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. సమాజంలో ఉన్న వివక్షను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాల్సిన అవసరాన్ని ఆమె వెల్లడించారు. విద్యలో ప్రోత్సాహకాలు, ఉపాధి అవకాశాల కల్పన, ఆరోగ్య సేవలకు సులభ ప్రాప్తి వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి న్యాయం జరిగేలా కృషి కొనసాగిస్తామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడి సమాజంలో గౌరవ స్థానం పొందేలా మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

# ఏపీని స్టీల్ హబ్‌గా మారుస్తాం

## ఖనిజ సంపద వినియోగంపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

**అమరావతి, మే 5 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఇనుప ఖనిజ నిక్షేపాలను ఆదాయ వనరులుగా మార్చడమే కాకుండా, రాష్ట్రాన్ని దేశానికే 'ఉక్కు కేంద్రం'గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉక్కు ఉత్పత్తిని పెంచేందుకు అధికారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మన రాష్ట్రంలో 1,938 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయి. ఇది రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దేవుడు ఇచ్చిన గొప్ప అవకాశం. ఈ నిక్షేపాలను పూర్తిస్థాయిలో వినియోగించి ఆదాయం పెంచడంతో పాటు భారీగా ఉపాధి సృష్టించాలి. రాబోయే పదేళ్లలో ఈ రంగంలో రూ. 1.90 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, 1.52 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే మన లక్ష్యం కావాలి" అని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలను వివరిస్తూ.. "ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్, జేఎస్‌డబ్ల్యు వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాయి. 2030 నాటికి 30 మిలియన్ టన్నులు, 2035 నాటికి ఏకంగా 113 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలి. గుర్తించిన 17 ఇనుప ఖనిజ బ్లాకులను వేగంగా కేటాయించి అభివృద్ధి చేయాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. గనుల శాఖ పనితీరుపై సీఎం ప్రశంసలు కురిపిస్తూ.. "గత ఆర్థిక సంవత్సరంలో 108 శాతం ఆదాయం (రూ. 3,416 కోట్లు) సాధించడం అభినందనీయం. ఒడిశా, కర్ణాటక వంటి ఖనిజ సంపన్న రాష్ట్రాల కంటే మెరుగైన వృద్ధిని ఏపీ సాధించడం మన నిబద్ధతకు నిదర్శనం. వచ్చే ఏడాదికి నిర్దేశించిన రూ. 4,650 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలి" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపరితల ద్రోణితో పిడుగులతో కూడిన వర్షాలు

## తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరిక

**విశాఖపట్టణం, మే 5:** తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అంచనా వేశారు. అదేవిధంగా తిరుపతి, చిత్తూరు, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిడుగుపాటు ప్రమాదం ఉన్నందున ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద ఆశ్రయం తీసుకోకూడదని ప్రజలకు సూచించారు. క సోమవారం ప్రకాశం, పార్వతీపురం మన్యం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచి, పిడుగులు పడినట్లు సమాచారం. రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు కురుస్తుండగా, మరోవైపు వేడి కూడా కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో 43.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా, అనేక మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో కూడా అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి నష్టం కలిగించింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇటీవల ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల 2 నుంచి 7 సెంటీమీటర్ల వరకు వర్షం పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అకాల వర్షాల కారణంగా పంటలకు నష్టం కలగొచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని గమనిస్తూ రైతులకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తోంది.

# భార్యను చంపడమెలా?

## ఇంటర్నెట్‌లో శోధించిన భర్త

## పద్మజ హత్య కేసును ఛేదించిన పోలీసులు

**కడప, మే 5:** ఇటీవల సంచలనం రేపిన ప్రొద్దుటూరులో పద్మజ మృతి కేసును పోలీసులు ఛేదించారు. భర్త కిరణ్‌కుమార్ ఆమెను హత్య చేసినట్లు నిర్ధరించారు. అతడిని అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. వివరాలను పోలీసు అధికారులు మీడియాకు వెల్లడించారు. భార్యను హత్య చేసేందుకు కిరణ్ యూట్యూబ్‌లో శోధించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు కొరియర్ ద్వారా విషం తెప్పించాడు. పాలకోవలో విషం కలిపి భార్యకు ఇచ్చాడు. పాలకోవ తిన్న తర్వాత పద్మజ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం ఆమె చనిపోయిందో లేదోనని ముఖంపై దిండుతో నొక్కాడు. భార్య లావుగా ఉండటంతోపాటు, తనను నిత్యం అనుమానిస్తోందన్న కారణంతోనే హత్య చేశాడని పోలీసులు తెలిపారు. పెళ్ళైన నాటి నుంచి కలిసి మెలిసి ఉండాల్సిన భర్తే ఇలా కాలయముడయ్యాడు. భార్యను చంపడానికి ఒక ప్రొఫెషనల్ కిల్లర్ లాగా ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, పథకం ప్రకారం హత్య చేసిన సంఘటన ఇది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 29వ తేదీన నిందితుడైన కిరణ్, తన భార్య పద్మను నిద్రిస్తున్న సమయంలో దిండుతో ముఖంపై అదిమి పట్టుకున్నాడు. ఊపిరాడకుండా చేసి అత్యంత కిరాతకంగా ఆమెను హతమార్చాడు. ఈ హత్య యాదృచ్ఛికంగా జరిగింది కాదని.. కిరణ్ గత కొంతకాలంగా ఇంటర్నెట్‌లో 'భార్యను ఎలా చంపాలి?', 'ఎలాంటి ఆధారాలు దొరకకుండా హత్య చేయడం ఎలా?' అని గూగుల్‌లో సెర్చ్ చేశాడని పోలీసులు తెలిపారు. కేవలం దిండుతో చంపడమే కాకుండా, భార్యకు విషం ఇచ్చి చంపడానికి కూడా నిందితుడు ప్రయత్నించాడు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా ఏకంగా రూ. 80,000 ఖర్చు చేసి విషాన్ని ఆర్డర్ చేయడం గమనార్హం. పద్మ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అతని సెల్‌ఫోన్, ఇంటర్నెట్ హిస్టరీని పరిశీలించగా, హత్యకు సంబంధించిన కుట్ర అంతా బట్టబయలైంది. నేరస్థులు ఎంత తెలివిగా ఎ÷-లాన్ చేసినా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు వారిని పట్టుకోగలరని ఈ కేసు మరోసారి నిరూపించింది. కేవలం గూగుల్ సెర్చ్ చేసిన ఆధారాలతోనే నిందితుడి పక్కా ఎ÷-లాన్‌ను పోలీసులు బహిర్గతం చేశారు. పద్మ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, కిరణ్‌ను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

# మానసిక వికలాంగుల పిల్లల సంరక్షణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

### బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి



**నర్సాపూర్ మే05( సమయం న్యూస్) :** మంగళవారం నర్సాపూర్ పర్యటనలో భాగంగా బేతాని మానసిక వికలాంగుల సంరక్షణ కేంద్రాన్ని చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, బి. వచన్ కుమార్ కమిషన్ సభ్యులు పరిశీలించారు-సభ్యులు సందర్శించారు.బేతాని మానసిక వికలాంగుల సంరక్షణ కేంద్రం కేవలం మానసిక వికలాంగులకు వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తే సరిపోదని వారికి మానసిక శారీరకంగా బుద్ధి మాంద్యం పరిజ్ఞానం పెంపొందించేందుకు కావలసిన చికిత్సలు అందించాలని బేతాని సౌరక్షణ కేంద్రం పనితీరును తరచూ సంక్షేమ శాఖ అధికారులు పరిశీలించాలని భవిష్యత్తులో సంరక్షణ కేంద్రం పనితీరు మెరుగు పరుచుకోవాలని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం మానసిక శారీరక, బుద్ధిమాంద్య వికలాంగుల పిల్లలకు అరటి పండ్లు పంపిణీ చేశారుఅనంతరం టిక్యా తాండ అంగన్వాడి కశ్రీ కేంద్రాన్ని సందర్శించి అంగన్వాడి పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తూ .జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు ఆదర్శంగా తీర్చిదిద్దాలని ,ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఉసిరిక పల్లి ఏరియాలో ఇటికబట్టిని పరిశీలించి బాల కార్మికులు ఎవరైనా బట్టీలలో పనిచేస్తున్నారా నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సిడిపిఓ స్వరూప సంబంధిత సంక్షేమ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

**■ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి..**



**వికారాబాద్, మే.05(సమయం న్యూస్) :** వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో సమావేశము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంబించాలని ,రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు , గొనె సంచులు అందుబాటులో ఉంచాలని ,ఇతరమౌళిక సదు-పాయాలు కల్పించాలని తెలిపారు .ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు.రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, ఆలస్యం లేకుండా, రైతులు వేచి చూసే పరిస్థితి రాకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారుకొనుగోలు చేసిన ధాన్యానికి జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి,డి ఆర్ డి ఎ శ్రీనివాస్, డి ఎస్ ఓ సుదర్శన్, డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ,వ్యవసాయ అధికారి రాజా రత్నం, మార్కెటింగ్ ఎం డి రియాజ్,మార్భెడ్ రేఖ,డి సి ఓ నాగార్జున సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్లోడింగ్ పెంచాలి

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



**నల్గొండ మే5( సమయం న్యూస్). :** .రైస్ మిల్లులు వద్ద అన్లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం, లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు . పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు,టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్ధార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని? అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. ఆన్లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు. అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అప్లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమీషనర్ ఆదేశించారు. పౌరసర ఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరస రఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం డి ఎం. రాంపతి నాయక్, డిసిఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు

# హైదరాబాద్ లో “BASF గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్” పేరిట గ్లోబల్ సర్వీస్ హబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిన అంతర్జాతీయ దిగ్గజ సంస్థ

**హైదరాబాద్ మే 05( సమయం న్యూస్). :** BASF (Badische Anilin- und Soda-Fabrik)... కొత్తగా 3వేల మందికి ఉపాధి దీూాఖీ గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్ వర్క్, ఫైనాన్స్, హెచ్ఆర్ సర్వీసెస్ విభాగాల్లో వ్యూహాత్మక కేంద్రంగా ఈ గ్లోబల్ సర్వీసెస్ హబ్హోటల్ తాజ్ కృష్ణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్లోబల్ సర్వీస్ హబ్ ఏర్పాటుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్)ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారికి అందజేసిన దీూాఖీ కంపెనీ ప్రతినిధులు160 ఏళ్ల చరిత్ర కలిగిన జర్మనీకి చెందిన దీూాఖీ... కెమికల్స్, మెటీరియల్స్, ఇండస్ట్రియల్ సొల్యూషన్స్, సర్ఫేస్ టెక్నాలజీస్, న్యూట్రిషన్ � కేర్, అగ్రికల్చరల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో... 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, మే 5 ( సమయం న్యూస్). :** నెలవారి తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గల ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా సిబ్బంది షిప్టుల వారీగా డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

**- అదనపు కలెక్టర్ సంపత్ రావు**



**ములుగు మే5 ( సమయం న్యూస్) :** ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ మరియు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

**ముఖ్య అంశాలు: సుస్థిర ఆదాయం:** ఆయిల్ ఫామ్ సాగు చేస్తే 30 ఏళ్ల వరకు నిరంతర దిగుబడి, ఆదాయం లభిస్తుంది.

**అంతర పంటలు:** తోటలో ఇతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు లాభం పొందవచ్చు.

**ప్రభుత్వ ప్రోత్సాహం:** ఎకరాకు సుమారు ₹50,000 సబ్సిడీ ప్రభుత్వం అందిస్తోంది.

జిల్లా గణాంకాలు: ప్రస్తుతం జిల్లాలో 1,069 మంది రైతులు 3,562 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు.

**పిలుపు:** మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యానవన

# వేసవికాలంలో త్రాగునీటి సరఫరా అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలీ .

**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం మే05( సమయం న్యూస్) :** డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్పై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఫీల్డ్ స్థాయిలో సమన్వయం పెంచి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పైప్లైన్ లీకేజీలను తక్షణమే సరిచేయాలని, అవసరమైతే బోర్వెల్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు.హీట్ వేవ్ దృష్ట్యా ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రజా ప్రదేశాల్లో త్రాగునీరు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఈరోజు అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐ+ూ) గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ గారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ సీవీ ఆనంద్ గారికి శుభాకాంక్షలు తెలియజేసిన స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు.

## రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్ (ఫేజ్ - 3) లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

■ చేయనున్న "ఐటీపీ ఏరో - ఇండియా" ప్లాంట్ కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు మంగళవారం భూమి పూజ నిర్వహించారు.



**శంషాబాద్ మే05( సమయం న్యూస్) :** విమాన ఇంజన్ల రిజిడ్ ట్యూబ్స్(Rigid tubes)కు అవసరమయ్యే ఎండ్-ఫిట్టింగ్స్ (End-fittings), బ్రాకెట్ల (Brackets)ను "ఐటీపీ ఏరో - ఇండియా" ఉత్పత్తి చేస్తోంది. తాజాగా భూమి పూజ నిర్వహించిన ఈ ప్లాంట్ లో 2027 నాటికి పూర్తి స్థాయిలో ఆపరేషన్స్ ప్రారంభం కానున్నాయి. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కొత్తగా 350 మందికి(హై స్కిల్డ్ ) ఉపాధి లభించనుంది. ఈ సంఖ్య రాబోయే రోజుల్లో 600కు పెరగనుంది.'

## మే పుష్పం పూసింది...

■ ఏడాదికోమారు.. ఈ మొక్క తీరేవేరు

■ వార్ల మల్లేశం- ఉపాధ్యాయులు-కోస్గి



**కోస్గి మున్సిపల్, మే,05(సమయం న్యూస్) :** భూగోళం పై నివసించే ప్రతి జీవికి ఏదో ఒక ప్రత్యేకత కలిగి ఉంటుంది. ఏడాది లో కేవలం ఒకే సారి పూసే అరుదైన మొక్క వికసించి అందర్ని ఆకుట్టుకొం టోంది. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణానికి చెందిన వార్ల మల్లేశం అనే ఉపాధ్యాయుడి టెర్రస్ గార్డెన్ లో ఈ పుష్పాలు వికసించి కనువిందు చేస్తున్నాయి. సంవత్సరంలో కేవలం మే మాసం లో ఒక్కసారి మాత్రమే పుష్పించే ఈ మొక్క వృక్షరాజ్యం లోని అమరిల్లిడేసి కుటుంబానికి చెందిన ఈ దుంపకాండ మొక్క శాస్త్రీయ నామం స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్ కాగా భారత దేశంలో ఈ మొక్కను ఫుట్బాల్ లిల్లీ, బ్లడ్ లిల్లీ,అనేపేర్లతో పిలుస్తారాని చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి నుండి ఈ మొక్క ఉనికి దేశంలో ఉందని ఆంధ్రప్రదేశ్ లోని పాడేరు నుండి తాను ఆసక్తి తో పదేళ్ల క్రితం ఈ మొక్క దుంపను తెచ్చి కుండీలో నాటనని ప్రతి ఏటా మే నెలలో ఒక్క పువ్వు మాత్రమే వచ్చేదని గత ఏడాది నాలుగు పుష్పాలు పూయగా ఇప్పుడు అయిదు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. జూన్ నెల వరకు ఈ పుష్పాలు ఉంటాయని ఆ తరువాత అవి రాలి పోయిన పిమ్మట వచ్చిన ఆకులు జనవరి వరకు మాత్రమే ఉండి ఎండిపోతాయని కేవలం దుంప మాత్రమే మట్టిలో దాగి ఉండి మే నెలలో మొగ్గలు తోడిగి పువ్వులు వస్తాయని, అందుకే మే పుష్పం అని పిలుస్తారని ఒక్క సారి దుంప నేలలో పాతితే చనిపోవడం అనేది ఉండదని వివరించారు.

## లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతం చేయాలి

■ కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మే 05( సమయం న్యూస్) :** ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులను వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. ఎలిగేడు, మంథని మండలాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆయన, తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించాలని సూచించారు. వేడిగాలుల నేపథ్యంలో కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రవాణా వాహనాలు, హమాలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## రైతులు పంట మార్పిడి చేసి లాభదాయక పంటలపై దృష్టి సారించాలీ

■ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు




**ఎలుగేడు మే05( సమయం న్యూస్). :.** ఎలిగేడు మండలంలో నిర్వహించిన రైతు వారోత్సవంలో ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి పాల్గొన్నారు. వరి సాగు పెరుగుదల రైతులకు లాభదాయకం కాదని, మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, దీనికి ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, రైతులకు పూర్తి మద్దతు ఉంటుందని వెల్లడించారు.

# సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

■ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్ మే05( సమయం న్యూస్). :** సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేయాలని అన్నారు. సిఎంఆర్ కు సంబంధించిన వివరాలను మిల్లర్ల వారిగా సమీక్షించారు. సిఎంఆర్ డెలివరీలో వెనుకబడిన మిల్లర్లు, ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. అన్ని మిల్లులలో, మిల్లులకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి అధికారులు, మిల్లర్లకు అవగాహన కల్పించాలని వివరించారు. సీఎంఆర్ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యపు సంచులు ఉంచడానికి తగిన గోదాములు ఇతరత్రా ప్రదేశాలు అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా ధాన్యపు సంచులను తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధాన్యపు సంచులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

■ సాదాబైనామా పరిష్కారంలో జాగ్రత్తగా వ్యవహరించాలి

■ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ మే05( సమయం న్యూస్). :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని,ఎప్పటికప్పుడు వస్తున్న దరఖాస్తు లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా (రాఅఎజూశ్రీవ ఝుశ్రీవ ఐవవంం) సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. సాదాబైనామా కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ పత్రాలు, తదితర వివరాలను ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సమాచారం అందించి, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ స్థాయిలో తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలన్నారు. ఒవెన్యూ డివిజనల్ అధికారులు సమస్యాత్మక కేసులను జిల్లా స్థాయికి పంపించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాంటాలు త్వరగా పూర్తి చేయాలి

- ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలి
- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ మే05( సమయం న్యూస్) :** కాంటాలు త్వరగా పూర్తి చేసి, ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కేంద్ర నిర్వాహకులను అదేశించారు. మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్ర పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, అలాగే అదే మండలంలోని కంచనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పీఏసీఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం బస్తాల కాంటా ఎంత వేస్తున్నారు? కేంద్రాలకు లారీలు సకాలంలో వస్తున్నాయా? తాడిపత్రిలు సరిపడా నిల్వలు ఉన్నాయా? అని కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు లేకుండా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉండాలని, రవాణా ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, ఆలస్యం లేకుండా, రైతులు వేచి చూసే పరిస్థితి రాకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. తేమ శాతం నిర్ధారణ (ఖీూు ఝఅఝతీఎం) ప్రకారం ధాన్యం స్వీకరించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. ఇక కేంద్రాల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, అదే విధంగా కేంద్రాల్లో గల రైతులతో మాట్లాడి, వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం రఘునాథపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలను, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయానికి హాజరు కావడం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వైద్యులు, నర్సులు ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ప్రభాకర్ రెడ్డి నీచరాజకీయాలు మానుకో

కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ గుంటి నర్సింలు.



**రాయపోల్, మే 5:** రాజకీయ లాభాల కోసం రైతాంగాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ గుంటి నర్సింలు కురుమ హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులు నెలకొన్న విషయాన్ని తెలంగాణ రైతులు ఇంకా మరచిపోలేదని ఆయన అన్నారు. రెండు రోజుల క్రితం దుబ్బాకలో జరిగినప్రజా పాలన ప్రగతి సమీక్ష సమావేశం నేపథ్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న ప్రజా ప్రతినిధి ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శిస్తూ కార్యకర్తలను ప్రేరేపించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో అనవసర విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, అపోహలు సృష్టించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. గత పాలనలో జరిగిన అనుభవాలను గుర్తు చేసుకుంటే రైతాంగం ఎదుర్కొన్న ఇబ్బందులు స్పష్టమవుతాయని అన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ ప్రజల మదిలో ఉన్నాయని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. అధికారంలో ఎవ్వరూ శాశ్వతం కాదని, ప్రజా ప్రయోజనాలే ప్రధానమని గుర్తు చేశారు. కపై కూడా ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు మానుకోని, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని సూచించారు.

# ప్రత్యామ్నాయ పంటల పై దృష్టి సారించాలి

- ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలి.
- జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక(ఐఏఎస్).



**నారాయణపేట,మే,05(సమయం న్యూస్) :** జిల్లాలోని రైతులు ప్రత్యామ్నాయ పంటల పై దృష్టి సారించేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఇస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.మంగళ వారం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధ్వర్యలో రైతు వారం (మే 4 నుంచి 9 వరకు) ఉద్యాన పంటల సాగు - ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంపుదల పై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కొంతమంది రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, ఆయిల్ ఫామ్ గింజలు, వ్యవసాయానికి ఉపయోగించే వివిధ రకాల యంత్రాల ప్రదర్శన ను. ఆమె తిలకించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ లో అన్ని శాఖల కార్యకలాపాలను రీ ఫ్రెష్ చేసుకోవాలని తెలిపారు. ఖమ్మం లో రైతులు ఎక్కువగా ఆయిల్ ఫామ్ తోటలను చేస్తారని, తాను అక్కడ విధులు నిర్వహించానని చెప్పారు. మన జిల్లా లో అసక్తి గల రైతులను ఖమ్మం తీసుకువెళ్ళి ఆయిల్ ఫామ్ సాగు ను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్, ఇతర పంటలను చిన్న సన్న కారు రైతులు కూడా పండించాలని ఆమె కోరారు. ప్రస్తుతం జిల్లాలో 206 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటల సాగు చేస్తున్నారని, 10 వేల ఎకరాల్లో సాగు చేస్తే మన జిల్లాలోనే ఫ్యాక్టరీ పెట్టాలని ప్రభుత్వాన్ని కోరడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సాయి బాబా, డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జయ చంద్రమోహన్, మండల స్థాయి ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ఈ ప్రాంతం సస్యశ్యామలంకావాలి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**రాయపోల్.ఎప్రిల్.05. :** ఏ కష్టం వొచ్చినా ఎల్లమ్మ తల్లికి మొక్కుకుంటామని, అమ్మ ఆశీస్సులతో ఈ ప్రాంతం ఎల్లప్పుడూ సస్యశ్యామలంగా మారి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు కోరుకున్నారు. సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలోశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు శాలుతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భక్తి, విశ్వాసంతో ఎల్లమ్మ తల్లిని మొక్కుకుంటే అమ్మవారి కృపతో కోరికలు నెరవేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నా. ఈ మహోత్సవాలను నిర్వహించిన గౌడ సంఘం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే ను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో బి ఆర్ ఎస్ రాయపోల్మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ. ఉపాధ్యక్షులు కర్నాల సత్యనారాయణ. తాజా మాజీ జెడ్పిటిసి యాదగిరి. బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు రాజిరెడ్డి. ఇప్ప దయాకర్. గ్రామ గౌడ సంఘం నాయకులు సత్యనారాయణ గౌడ్. నాగుల్ గౌడ్. కృష్ణ గౌడ్. మండల నాయకులు రాజారాం మధు. దాసరి బుజ్జి. రాజనర్సు. మల్లేశం. మంద స్వామి. టెంకంపేట మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరు సీ హెచ్ సీ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**మద్దూర్ మున్సిపల్, మే,05(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్. ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రిసెప్షన్ , గైనిక్, పీడియాట్రిక్, ల్యాబ్, మేల్ వార్డ్, ఫార్మాసిస్ట్, ఆపరేషన్ థియేటర్, ఇంజెక్షన్ గది, జనరల్ వార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల బంధువులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.చిన్నారుల వైద్య సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. మద్దూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఒక మోడల్ కేంద్రంగా ఉండాలని, అందుకు అవసరమైన వసతి,సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, ఈఎన్ టీ వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడి విభాగాల వారీగా రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారని వాకబు చేశారు. ఆస్పత్రి ప్రహరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వకర్త డాక్టర్ మల్లికార్జున్, ఆర్.ఎంవో పావని, పీఆర్ ఏ ఈ పాల్గొన్నారు.

# వేసవి కాలంలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్




**ఖమ్మం, మే 5: ( సమయం న్యూస్ ) :** వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ త్రాగునీటి సరఫరాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయం ఉండాలని, ఫీల్డ్ స్థాయిలో అవసరమైన సమన్వయం చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పీక్ సమ్మర్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లోనే ఉండి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని, ఎంపీడీఓలు, ఎంపీఓలు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాసేవలో స్పందన అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్యలు కేవలం ఆర్డబ్ల్యూఎస్ శాఖకు మాత్రమే సంబంధించినవి కావని, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మే నెలలో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముండటంతో ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.పైప్‌లైన్ లీకేజీలు, నష్టాలను వెంటనే పరిష్కరించాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. రోడ్డు పనుల సమయంలో పైప్‌లైన్ దెబ్బతిన్నట్లయితే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఖర్చు భరింపజేయాలని తెలిపారు.మండలాల వారీగా త్రాగునీటి పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, మొదట మిషన్ భగీరథ నీరు ప్రజలకు చేరేలా చూడాలని, తదుపరి స్థానిక వనరులను వినియోగించాలని, అవసరమైతే బోర్వెల్ ఏర్పాటు చేయాలని, చివరిగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని దశలవారీ చర్యలు సూచించారు.ఎత్తైన గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటినీ సరఫరా చేయాలని, సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్ధవంతంగా వినియోగించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన త్రాగునీటి నిధులను జెడ్పీ సీఈఓ సమన్వయంతో అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. సరఫరా లేని ఇళ్లను గుర్తించి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.వేసవి కాలంలో వీధి జంతువులు, చిన్న పక్షులు కూడా నీటి కొరతను ఎదుర్కొంటా యని, గ్రామాలు, మున్సిపాలిటీలలో స్థానిక సంస్థలు చిన్న, చిన్న నీటి గుంతలు (వాటర్ పిట్స్) ఏర్పాటు చేసి వాటికి తగినంత నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను పోలీస్ ఎస్‌హెచ్ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్‌స్ట్రోక్ బాధితుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, తగిన ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.లేబర్ శాఖతో సమన్వయం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కోచింగ్ సెంటర్లు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు బయట నిద్రించకుండా అవగాహన కల్పించాలని, మార్కెట్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజా ప్రదేశాల్లో త్రాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిపిఓ రాంబాబు, సిపిఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ, ఎస్ఈ పి.హెచ్., గ్రౌండ్ వాటర్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఏపిడిలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ఉన్నతాధికారులకు పువ్వాడ ఉదయ నగర్ బాధితుల వినతులు

**ఖమ్మం , మే5 :( సమయం న్యూస్ ) :** వివిధ సమస్యలపై పువ్వాడ ఉదయ్ నగర్గ్రామపంచాయతీ కార్యదర్శి , గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఇస్మాయిల్‌పై బాధితులుషేక్. లాల్ పాషా , కందుకూరి రేణుకలు జిల్లా కలెక్టర్ , జిల్లా పోలీస్ కమిషనర్లకు వినతి పత్రాలను సమర్పించారు. తనది మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం ఎల్లంపేట గ్రామ నివాసి అయినా తను లాల్ పాషా 2020లో పువ్వాడ ఉదయ నగర్ లో ప్లాట్ నెంబర్ 1972 (; 75 గజాల స్థలాన్ని ) కొనుగోలు చేశానని , ఆ గ్రామ నివాసి ఇస్మాయిల్ ద్వారా జయమ్మ అనే మహిళ ప్లాటును కొనుగోలు చేసినట్లు , కొనుగోలు సందర్భంగా జయమ్మ ను తాము చూడలేదని , వారు వృద్ధులు కాబట్టి బయటకి రాలేరని , తానే వెళ్లి వారి సంతకాన్ని తీసుకొని ఇస్మాయిల్ రావవడం జరిగిందని బాధితుడు లాల్ పాషా పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా 2023 జూన్ 27వ తేదీన ఇంటి నిర్మాణం కోసం పువ్వాడ ఉదయ నగర్ కు వెళ్ళగా తమ ప్లాట్ లో రేకులి షెడ్డు నిర్మాణం జరిగిందని తెలిపారు. ఈ విషయమై సదరు ఇస్మాయిల్ ను నిలదీయగా తనకిచ్చిన డబ్బులు సగమే చెల్లిస్తానని చెబుతూ ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 తేదీన ఒక అగ్రిమెంట్ చేశాడని ఆ అగ్రిమెంట్ తుది గడువు 45 రోజులు గడిచిపోయినప్పటికీ అతడి నుండి స్పందన లేదని ఆరోపించారు. ఈ విషయమై రఘునాధపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అక్కడుండి ఏమాత్రం సానుకూల స్పందన లేదని విమర్శించారు. కందుకూరి రేణుక , పువ్వాడ ఉదయ నగర్ నివాసి ప్లాట్ నెంబర్ 412 కాగా ఈ ప్లాటు ఆధారంగా నివాస ధ్రువీకరణ పత్రం , కరెంట్ మీటర్ మంజూరు అయ్యాయని , కరెంటు బిల్లులు.... ఈ ప్లాట్ లో ఇల్లు నిర్మించుకొని గత 8 సంవత్సరాల నుండి ఇక్కడ నివసిస్తున్నప్పటికీ , తమకు ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకోగా అది కాకుండా



చేశారని కష్టపడి ఇల్లు కట్టుకోగా ఇంటి నెంబర్ కూడా కేటాయించకుండా గత ఎనిమిది సంవత్సరాల నుండి తమకు గ్రామపంచాయతీ కార్యదర్శి ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా ఇంటి నెంబరు కూడా కేటాయించకుండా తమకు తిప్పుకుంటున్నారని ఆరోపించారు. కాశ బోయిన అలిబోయిలు మంగ , ఓర్సు రంగమ్మ , బత్తుల సుభద్ర , బత్తుల నాగేంద్ర , జోగు భాగ్యమ్మ లకు ఓయ్ చిలక సర్వే నెంబరు 192 పరిధిలోని పువ్వాడ ఉదయ నగర్ లో దశాబ్ద క్రితం తమకు 72 గజాల ప్లాట్లను ఇచ్చారని , అందులో కొందరికి 58 జీవో ద్వారా క్రమబద్ధకరించగా మరికొందరికి ఇంద్ర మహిళను మంజూరు చేశారని , తమలో కొందరు నిర్మాణ పనులు పోటీ చేసుకోగా ఇంకొందరు నిర్మాణాలను చేసుకుంటుండగా ప్రైవేట్ వ్యక్తులు తమకు ఇబ్బందులు పెడుతూ భయాందోళనలు కలిగిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పంచాయతీ కార్యదర్శి కూడా తమకు సహకరించకుండా ఇబ్బందులు కలగజేస్తున్నాడని విమర్శించారు. పలు దఫాలుగా ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగడ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమపైనే ఆరోపణలు చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్లో తమపై కేసు నమోదు చేయించారని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సాధించి తమకు న్యాయం చేయాలని కోరారు. గత రెండు దశాబ్దాలుగా పువ్వాడ ఉదయ నగర్ లో నివాసముంటూ సామాజిక కార్యకర్తగా వీరనారీమణుల సమితి సంఘం పేరుతో మహిళల అభివృద్ధికి వివిధ మార్గాల ద్వారా సేవ చేస్తున్న భూక్య ఉపేంద్ర బాయి అనే తన పట్ల తనకు ఏమాత్రం తెలియని తనకి విధమైన సంబంధం లేని విషయంలో ఉద్దేశపూర్వకంగా అరవ లత అనే మహిళ తనపై తప్పుడు ఆరోపణలతో రఘునాధ పాలెం పీఎస్ లో ఫిర్యాదు చేయగా సిపిఐ కి చెందిన ఒక రౌడీషీటర్ యాకూబ్ అనే అతడు దీనిని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ తన పరువు ప్రతిష్ట లకు భంగం కలిగిస్తూ మానేసిక శోభను కలిగిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కూడా దీనిపై విచారణ చేయకుండా తనపై వచ్చిన ఆరోపణలను తాసిల్దార్ కు రిఫర్ చేయడం తగదన్నారు. అదేవిధంగా యాకూబ్ తోపాటు గ్రామ సర్పంచ్ వీరికి సహకరిస్తున్న రఘునాథపాలెం సీఐ లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు సమర్పించిన వినతి పత్రాలలో విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన బృందంలో రేణుక భర్త యాకేష్ , సరోజిని , లక్ష్మి లతోపాటు బాధితులందరూ పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇచ్చి చైన్ స్నాచింగ్... నిందితుడు రిమాండ్



**రాయపోల్, మే 5:** లిఫ్ట్ ఇస్తానంటూ మాయమాటలు చెప్పి మహిళ నుంచి బంగారం, వెండి ఆభరణాలు అపహరించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై జి. అరుణ్‌కుమార్ తెలిపారు.

గత నెల 26వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో దౌల్తాబాద్ శివాజీ విగ్రహం వద్ద ఒక మహిళ ఆటో కోసం ఎదురుచూస్తుండగా, ఓ గుర్తుతెలియని వ్యక్తి తనను గౌడుగుపల్లి గ్రామానికి వెళ్తున్నానని చెప్పి మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. అనంతరం దీపంపల్లె గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద బైక్‌కు పెట్రోల్ అయిపోయిందని చెప్పి ఆపి, మాయమాటలతో మహిళ మెడలో ఉన్న 3 తులాల బంగారు తాడు, 2 గ్రాముల చెవి కమ్మలు, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు లాక్కొని పరారయ్యాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీను (30)ను అదుపులోకి తీసుకుని విచారించి, నేరాన్ని ఒప్పుకున్న నేపథ్యంలో రిమాండ్‌కు పంపించారు.నిందితుడి వద్ద నుంచి 28.50 గ్రాముల బంగారు పుస్తెల తాడు, 2.07 గ్రాముల బంగారు చెవి పోగులు, 190.30 గ్రాముల వెండి గొలుసులు, నేరానికి ఉపయోగించిన హీరో గ్లామర్ బైక్‌తో పాటు ఓప్పో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును చేధించిన దౌల్తాబాద్ ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు విక్రమ్, నాగరాజు, స్వామిలను సీఐ అభినందించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు లిఫ్ట్ ఇస్తామని చెప్పినప్పుడు వారి మాటలను నమ్మకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

# యూపీఎస్సీ అభ్యర్థులకు వరంగా 'ప్రెప్‌మంకీ' యాప్



**హైదరాబాద్, మే5 :** యూపీఎస్సీ సహా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఆధునిక సాంకేతికతతో నాణ్యమైన మార్గదర్శకత్వం అందించేందుకు రూపొందించిన 'ప్రెప్‌మంకీ' అనే కృత్రిమ మేధస్సు ఆధారిత యాప్‌ను తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాంకేతికతను విద్యా రంగానికి అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం లభిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని, డిజిటల్ విద్యా విప్లవంలో ఇలాంటి వినూత్న ఆలోచనలు మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు.విద్యా నిపుణులు, సాంకేతిక నిపుణులు సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ యాప్‌లో స్మార్ట్ నోట్స్, సమాధానాల మూల్యాంకనం, అనుకూల ప్రశ్నా బ్యాంకులు, తక్షణ పనితీరు విశ్లేషణ, మెంటార్ సహాయం వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి.ప్రెప్‌మంకీ వ్యవస్థాపక బృందంలో తలశిల రంజిత్, సుధాకర్, రామ్ అభినవ్ తేజ్, పావని, ఆకాశ్, మేఘనా రెడ్డి ఉన్నారు.దేశవ్యాప్తంగా వివిధ నేపథ్యాల నుంచి వచ్చే అభ్యర్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడం, సరైన దిశానిర్దేశంతో విజయాన్ని అందించడం తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



# అంతర్జాతీయ వేదికపై విశాఖ 'టార్గెట్'

## నేపాల్‌లో ఎగిరిన ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం

### టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విశాఖ క్రీడాకారులు

## కంచర్ల అచ్యుతరావు అభినందనలు



**విశాఖపట్టణం, మే 5:** అంతర్జాతీయ క్రీడా యవనికపై విశాఖపట్టణం క్రీడాకారులు మరోసారి తమ సత్తా చాటారు. నేపాల్ వేదికగా జరిగిన అంతర్జాతీయ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో విశాఖకు చెందిన నలుగురు క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ చారిత్రక విజయంతో విశాఖ నగరం ఆనంద పరవశంలో మునిగిపోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించాయి. ప్రతిభకు పట్టుదల తోడైతే విజయం వరిస్తుందని ఈ క్రీడాకారులు నిరూపించారు. ఈ ఘనవిజయంపై రాష్ట్ర టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, భవిష్యత్తులో వీరు మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడం ఇతర వర్ధమాన క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఛాంపియన్‌షిప్ గెలిచిన నలుగురు క్రీడాకారుల గురించి తెలుసుకున్న విశాఖ వాసులు వారిని అభినందనలతో ముంచెత్తుతున్నారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారుల కృషి వెరసి ఈ విజయానికి బాటలు వేశాయని క్రీడాభిమానులు కొనియాడుతున్నారు.

# శాంసన్ శివతాండవం!



- ఢిల్లీ క్యాపిటల్స్ పై చెన్నయ్ సూపర్ కింగ్స్ ఘన విజయం
- ఎనిమిది వికెట్ల తేడాతో ఎల్లో ఆర్మీ గెలుపు
- అజేయ అర్ధ శతకంతో చెలరేగిన సంజూ శాంసన్
- సొంత గడ్డపై తేలిపోయిన ఢిల్లీ బ్యాటర్లు, బౌలర్లు
- 15 బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన



**న్యూఢిల్లీ, మే 5 :** ఐపీఎల్ టోర్నీలో చెన్నయ్ సూపర్ కింగ్స్ (సీఎస్కే) అద్భుత విజయం నమోదు చేసింది. మంగళవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ పై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధిం చింది. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఒంటిచేత్తో మ్యాచ్ ను చెన్నయ్ వైపు పూర్తిగా తిప్పేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నయ్.. కేవలం 17.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 159 పరుగులు చేసి అలవోకగా గెలుపొందింది. ఇంకా 15 బంతులు మిగిలి ఉండగానే ఎల్లో ఆర్మీ ఈ కష్టమైన లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవడం విశేషం.

### కలవరపెట్టిన ఢిల్లీ బ్యాటింగ్..

సొంత గడ్డపై టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ కు ఏమాత్రం కలిసి రాలేదు. చెన్నయ్ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటర్లు పెవిలియన్ కు క్యూ కట్టారు. సమీర్ రిజ్వీ చివర్లో మెరుపులు మెరిపించాడు. అతడు 24 బంతుల్లో అజేయంగా 40 పరుగులు సాధించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ట్రిస్టన్ స్టబ్స్ 31 బంతుల్లో 38 పరుగులు చేసి ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. పతుమ్ నిస్సాంక 15 బంతుల్లో 19 పరుగులకే పరిమితమయ్యాడు. చెన్నయ్ బౌలర్లలో నూర్ అహ్మద్ మూడు ఓవర్లలో 22 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అకీల్ హొసేన్ నాలుగు ఓవర్లలో కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీశాడు. జామీ ఓవర్టన్ ఒక ఓవర్ వేసి ఐదు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు.

### చెలరేగిన సంజూ శాంసన్..

156 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నయ్ సూపర్ కింగ్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముఖ్యంగా వన్ డౌన్ లో వచ్చిన సంజూ శాంసన్ క్రీజులో శివమెత్తాడు. ఢిల్లీ బౌలర్లను ఒక ఆట ఆడుకున్నాడు. కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 87 పరుగులు సాధించి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని ఖాయం చేశాడు. అతనికి తోడుగా యువ ఆటగాడు కార్తీక్ శర్మ 31 బంతుల్లో 41 పరుగులతో నాటౌట్ గా నిలిచి అద్భుతమైన సహకారం అందించాడు. అంతకుముందు ఓపెనర్ ఉర్విల్ పటేల్ 9 బంతుల్లో 17 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. శాంసన్, కార్తీక్ శర్మ భాగస్వామ్యాన్ని విడదీయడం ఢిల్లీ బౌలర్ల తరం కాలేదు.






### తేలిపోయిన ఢిల్లీ బౌలర్లు..

లక్ష్య ఛేదనలో చెన్నయ్ బ్యాటర్లను కట్టడి చేయడంలో ఢిల్లీ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. లుంగీ ఎంగిడి నాలుగు ఓవర్లలో 30 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ నాలుగు ఓవర్లు వేసి 30 పరుగులిచ్చినా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఏ దశలోనూ ఢిల్లీ బౌలర్లు చెన్నయ్ బ్యాటర్లపై కనీస ప్రభావం చూపలేకపోయారు. కచ్చితత్వంతో కూడిన బంతులు వేయడంలో ఢిల్లీ పేసర్లు, స్పిన్నర్లు పూర్తిగా తేలిపోయారు. దీనిని సీఎస్కే బ్యాటర్లు పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జట్టుకు సూపర్ విక్టరీని అందించారు.

# బుమ్రా కెరీర్‌లోనే చెత్త రికార్డు?



ఒకప్పుడు డెత్ ఓవర్లలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను వణికించిన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. ఇప్పుడు ఐపీఎల్ 2026లో పూర్తిగా ఫామ్ కోల్పోయినట్లు కనిపిస్తున్నాడు. అతని ప్రదర్శన ఈ సీజన్‌లో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. 10 మ్యాచ్ ల్లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసిన బుమ్రా, తన కెరీర్‌లోనే అత్యంత చెత్త గణాంకాలను నమోదు చేస్తున్నాడు. ఒకప్పుడు కచ్చితమైన యార్కర్లు, అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రపంచంలోని అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన బుమ్రా, ఈ సీజన్‌లో మాత్రం తన నియంత్రణ కోల్పోయాడు. అతని బౌలింగ్ లో తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా LSGతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో వరుసగా రెండు నో-బాల్స్ వేయడం అతని ఫామ్‌పై ప్రశ్నలు లేవనెత్తింది. అదే ఓవర్‌లో వికెట్ తీసుకున్నప్పటికీ, అది నో-బాల్ కారణంగా నాటౌట్‌గా మారిపోయింది..

ఈ సీజన్‌లో ఇప్పటివరకు బుమ్రా వేసిన నో-బాల్స్ సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇది అతని స్థాయి బౌలర్‌కు అసాధారణం. ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా తీవ్రంగా స్పందించారు. ప్రొఫెషనల్ క్రికెటర్‌గా నో-బాల్స్ వేయడం అంగీకారయోగ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. బుమ్రా బౌలింగ్‌లో ముఖ్యమైన బలం అయిన యార్కర్ కూడా ఈ సీజన్‌లో ప్రభావం కోల్పోయింది. ఒకప్పుడు పర్ఫెక్ట్‌గా ఉండే యార్కర్లు ఇప్పుడు ఫుల్ టాస్‌లుగా మారడం లేదా బ్యాట్స్‌మెన్ సులభంగా బౌండరీలు కొట్టడం కనిపిస్తోంది. టీ20 క్రికెట్‌లో చిన్న తప్పిదం కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది, బుమ్రా విషయంలో అదే జరుగుతోంది. అంతేకాకుండా, ఆధునిక క్రికెట్‌లో డేటా విశ్లేషణ పెరగడంతో బ్యాట్స్‌మెన్ బౌలర్లను ముందుగానే అంచనా వేయగలుగుతున్నారు. బుమ్రా బౌలింగ్ శైలి, కోణం, లెంగ్త్‌పై బ్యాట్స్‌మెన్‌కు స్పష్టమైన అవగాహన రావడంతో అతనిపై ఒత్తిడి తగ్గింది. దీని వల్ల అతని డాట్ బాల్స్ సంఖ్య తగ్గిపోగా, వికెట్లు తీసే సామర్థ్యం కూడా ప్రభావితమైంది. మానసిక ఒత్తిడి కూడా బుమ్రా ఫామ్‌పై ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. వరుసగా వికెట్లు తీయ లేకపోవడం వల్ల అతను ప్రతి బంతిని పర్ఫెక్ట్‌గా వేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే మరిన్ని తప్పిదాలు జరుగుతున్నాయి. ముంబై ఇండియన్స్ జట్టు కూడా ఈ సీజన్‌లో అధిక స్కోర్లు ఇస్తుండటంతో, బౌలర్లపై అదనపు ఒత్తిడి పడుతోంది. అయితే, బుమ్రా వంటి ప్రతిభావంతుడైన బౌలర్‌ను తక్కువ అంచనా వేయడం తొందరపాటు అవుతుంది. క్రికెట్‌లో ఫామ్ తాత్కాలికమే, కానీ ప్రతిభ శాశ్వతం. ఒక మంచి స్పెల్‌తోనే అతను మళ్లీ తన పాత ఫామ్ ను అందుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతానికి, ఐపీఎల్ 2026లో బుమ్రా ప్రదర్శన అతని అభిమానులను నిరాశకు గురిచేస్తోంది.

## 'నన్ను టెస్ట్ ప్లేయర్ అన్నారు..'

### టీ20 ఆడటం రాదన్నారు: కేఎల్ రాహుల్ భావోద్వేగం..

ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో క్లాసిక్ బ్యాటింగ్‌కు నిలువుటద్దం కేఎల్ రాహుల్. కర్ణాటకకు చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్, తన కెరీర్ ఆరంభంలో సాంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు మాత్రమే పనికొస్తాడని విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ. పట్టుదలతో తన శైలిని మార్చుకుని మూడు ఫార్మాట్లలోనూ అత్యుత్తమ ఆటగాడిగా ఎదిగాడు. ముఖ్యంగా ఐపీఎల్ వంటి వేదికలపై భారీ స్కోర్లతో పాటు వేగంగా పరుగులు సాధిస్తూ విమర్శకుల నోళ్లు మూయించాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్న రాహుల్, క్రీజులో ఉంటే ఆ ఫీల్డర్లకు పని చెప్పడం ఖాయం. మైదానంలో చురుకుగా ఉంటూ భారీ సిక్సర్లతో విరుచుకుపడటం అతని ప్రత్యేకత. గత పదేళ్ల ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన రాహుల్, ఇప్పుడు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా కనిపిస్తున్నాడు. అయితే తాజాగా 'జియోస్టార్' టాక్ షోలో పాల్గొన్న రాహుల్.. తన అ అంతరంగంలోని భావాలను పంచుకున్నాడు. త నపై ఉన్న "టెస్ట్ స్పెషలిస్ట్" అనే ము ద్రను చెరిపివేసి, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నిరూపించుకోవడం పట్ల గర్వంగా ఉందని తెలిపాడు. టెస్ట్ క్రికెట్ కు మాత్రమే నువ్వు ఆడగలవు.. టీ20 క్రికెట్ కు పనికి రావు అని చాలా మంది అంటుంటే ఎంతో బాధపడ్డట్లు చెప్పుకొచ్చాడు. పదేళ్ల క్రితం టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం తనకు కలగా ఉండేదని, కానీ నిరంతర శ్రమతో ఆ అడ్డంకులను అధిగమించానని చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌పై 64 బంతుల్లోనే 152 పరుగులు చేసిన అద్భుత ఇన్నింగ్స్ గురించి ప్రస్తావిస్తూ.. ఫలితం అనుకూలంగా రాకపోయినా తన ఆటతీరుపై తనకు సంతృప్తి ఉందన్నాడు.

# ముగిసిన మిస్టర్ కూల్ శకం?

**ఐపీఎల్ 2026 నుంచి ధోనీ అవుట్!**



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్ (IPL 2026) మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పిక్క గాయం కారణంగా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోని, తాజాగా మంగళవారం ఢిల్లీ క్యాపిట ల్స్‌తో జరగనున్న కీలక పోరుకు కూడా అందుబాటులో లేకపోవడంతో అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత మ్యాచ్‌ల వరకు ధోని మైదానానికి రాక పోయినా జట్టుతో పాటే ఉన్నాడు. అయితే ఢిల్లీతో మ్యాచ్ కోసం సీఎస్కే జట్టు ఢిల్లీకి పయనమవగా, ధోని వారితో కలిసి వెళ్లలేదని సమాచారం. ఈ విషయాన్ని సీఎస్కే బౌలింగ్ సలహాదారు ఎరిక్ సిమన్స్ స్వయంగా ధృవీకరించారు. "ధోని ప్రస్తుతం మాతో లేడు. ఆయన ఇంకా గాయం నుంచి కోలుకుంటున్నారు" అని సిమన్స్ పేర్కొన్నారు.

### ముగిసిన శకం?

జట్టుతో పాటు ధోని ప్రయాణించకపోవడంతో ఆయన ఈ సీజన్ నుంచి పూర్తిగా తప్పుకున్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. 44 ఏళ్ల వయసులో గాయం తిరగబెట్టడం, మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేకపోవడం తో ఇదే ఆయనకు చివరి ఐపీ ఎల్ అయ్యే అవకాశం ఉందని వా ర్తలు వస్తున్నాయి. మైదానంలోకి దిగకుండానే ధోని రిటైర్మెంట్ ప్రకటించవచ్చని వస్తున్న ఊహాగానాలు సీఎస్కే అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇదే సమ యంలో ధోని సేవలు అందుబాటులో లేకపోవడం చెన్నై జట్టు ప్రదర్శనపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 04 మ్యాచ్‌లు గెలిచి, 05 మ్యాచ్‌లు ఓడిపోయింది. ప్రస్తుతం ఈ జజట్టు పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసా గుతుంది. చెన్నై ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన మ్యాచ్‌లు అత్యంత కీలకం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధోని గైర్హాజరు జట్టుకు పెద్ద లోటుగా మారింది. మరి ధోనీ ఈ సీజ న్ చివరలోనైనా మైదానంలో కని పిస్తాడా లేక ఇలాగే వీడ్కోలు పలుకుతాడా అనేది వేచి చూడాలి.



## కొత్త బంధాలపై తమన్నా వ్యాఖ్యలు

ప్రేమ, వ్యక్తిగత బంధాలపై నటి తమన్నా భాటియా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, ప్రేమ అనేది జీవితంలో ఒక్కసారి మాత్రమే జరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మనసుకు నిజంగా నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదని తమన్నా అన్నారు. ప్రతి సంబంధం మన జీవితానికి ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుందని, ఆ అనుభవాలు వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేమలో ఉన్నప్పుడు అది ఇద్దరికీ ఆనందాన్ని, ఎదుగుదలను ఇవ్వాలి గానీ, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేలా మారకూడదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రేమను ఒక లావాదేవీలా చూడకూడదని తమన్నా పేర్కొన్నారు. ఎదుటివారి నుంచి ఏదైనా ఆశించడం మొదలైతే అది నిజమైన ప్రేమ కాకుండా వ్యాపార సంబంధంలా మారిపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు. నిజమైన ప్రేమ అనేది స్వేచ్ఛ, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడం వంటి విలువలపై నిలబడాలని ఆమె తెలిపారు. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్ల నేపథ్యంలో చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా సంబంధాలపై ఆమె వ్యక్తపరిచిన స్పష్టమైన అభిప్రాయాలు యువతలో చర్చకు దారితీస్తున్నాయి.

## 'కల్కి-2'లో సాయి పల్లవి?



కల్కి 2898 ఏడి చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రభాస్ ఇప్పుడు ఆ సినిమాకు రాబోయే రెండో భాగంపై అందరి దృష్టి నిలిచింది. దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న ఈ భారీ సీక్వెల్‌కు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సీక్వెల్‌లో సహజ నటిగా పేరు తెచ్చుకున్న సాయి పల్లవి కీలక పాత్రలో కనిపించనున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మొదటి భాగంలో పలువురు స్టార్ నటీనటులు మెరిసిన నేపథ్యంలో, రెండో భాగంలో మరింత బలమైన పాత్రలను జోడించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో సాయి పల్లవి ఎంట్రీ ఉంటే, కథలో భావోద్వేగ గాఢత మరింత పెరుగుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఈ వార్త నిజమైతే, ప్రభాస్--సాయి పల్లవి కలయికను తెరపై చూడటం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. మొత్తానికి, 'కల్కి-2'లో సాయి పల్లవి నటిస్తుందా లేదా అన్నదానిపై అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్తతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## ఫౌజీ చిత్రబృందానికి ప్రమాదం

**హైదరాబాద్, మే 5:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రబృందానికి విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటన సినీ వర్గాలను కలచివేసింది. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ వేగంగా కొనసాగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో చిత్రబృందం ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రొడక్షన్ విభాగానికి చెందిన ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో చిత్రబృందం, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. షూటింగ్ పనుల నిమిత్తం బయలుదేరిన సమయంలోనే ఈ ప్రమాదం జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ వ్యయంతో






నిర్మిస్తోంది. సినిమాలో ప్రభాస్ సరసన ఇమాన్వీ కథానాయికగా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి సంతాపం తెలియజేసిన చిత్రబృందం, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

### బాలీవుడ్‌లో సత్తా చాటలేకపోతున్న

# సౌత్ స్టార్స్..

ఇక్కడ టాప్‌పొజిషన్.. హిందీలో ఫ్లాపులు

**ఉత్తరాది కథానాయికల ముందు తేలిపోతున్న దక్షిణాది భామలు**



సౌత్ ఇండియాలో స్టార్ హోదాను అనుభవిస్తున్న హీరోయిన్లు హిందీ తెరపై మాత్రం తమ మ్యాజిక్ న రిపీట్ చేయలేకపోతున్నారు. ఒకప్పుడు శ్రీదేవి, జయప్రద వంటి నటీమణులు బాలీవుడ్‌ను చాలా కాలాం ఏలారు. కానీ ప్రస్తుత తరం దక్షిణాది తారలకు అక్కడ అడుగుపెట్టడం సులభమైనా సెటిల్ అవ్వడం మాత్రం కత్తిమీద సాములా మారింది. స్టార్ ఇమేజ్ ఉన్నప్పటికీ హిందీలో వరుస ఫ్లాపులు పలకరిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఫిదా బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన ఆమె నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1, 2026న విడుదలైంది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. మొదటి మూడు రోజుల్లో ఈ చిత్రం కనీసం రూ. 3 కోట్ల రూపాయల వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. క్రిటిక్స్ సాయి పల్లవి నటనను మెచ్చుకున్నప్పటికీ కమర్షియల్‌గా ఈ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. చందమామ కాజల్ అగర్వాల్ దక్షిణాదిలో ఎన్నో ఏళ్లుగా స్టార్‌గా ఉన్నప్పటికీ హిందీలో మాత్రం సరైన బ్రేక్ దక్కించుకోలేకపోయింది. అజయ్ దేవగన్ సరసన 'సింగం' వంటి హిట్ ఉన్నా ఆ క్రేజ్ నిలవలేదు. ప్రస్తుతం కాజల్ 'ది ఇండియా స్టోరీతో పాటు 'రామాయణ్' చిత్రాలతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇక చెన్నై చిన్నది త్రిష పరిస్థితి కూడా భిన్నంగా లేదు. అక్షయ్ కుమార్ సరసన 'కట్టా మీటా'తో ఎంట్రీ ఇచ్చి **ఆ ఒక్క సినిమాతోనే బాలీ**వుడ్‌కు దూరమైంది. బుట్టబొమ్మ పూజా హెగ్డేకు హిందీలో హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్ వంటి స్టార్లతో నటించే అవకాశం వచ్చినా 'మొహెంజదారో', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' వంటి చిత్రాలు ఫ్లాప్ **అవ్వడం ఆమె కెరీర్**పై ప్రభావం చూపింది. తమన్నా, శ్రియ శరణ్ వంటి నటీమణులు బాలీవుడ్‌లో పదే పదే ప్రయత్నిస్తున్నా.. అక్కడ 'స్టార్' హోదాను మాత్రం అందుకోలేకపోతున్నారు.

### సబ్ స్క్రిప్షన్ ట్రెండ్ నూ

## వదలని జక్కన్న..

### ఇదెక్కడి మాస్ ప్లాన్ అయ్యా!

బాహుబలి, RRR సినిమాలతో ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ఈ జక్కన్న, ఇప్పుడు సూపర్‌స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసం అంతకు మించిన ప్లాన్‌తో రంగంలోకి దిగుతున్నారు.ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది అదేమంటే ఈ మెగా ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఒక వినూత్నమైన మార్కెటింగ్ స్ట్రాటజీని అమలు చేయ బోతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో బాగా వైరల్ అయిన సబ్ స్క్రిప్షన్ ట్రెండును రాజమౌళి ఇప్పుడు తనకు అనుకూలంగా వాడుకున్నట్టున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు లేదా నటీనటుల ఇంటర్వ్యూలు సినిమాని ప్రమోట్ చేసుకోవడానికి వాడుకుంటారు కాబట్టి దాదాపుగా అవన్నీ ఉచితంగానే దొరుకుతాయి.కానీ, 'వారణాసి' విషయంలో రాజ మౌళి రూటు మార్చారు. ఈ సినిమా వెనుక ఉన్న కష్టాన్ని, తెర వెనుక జరిగే ఆసక్తికరమైన BTS Videos వీక్షించాలనుకునే అభిమానుల కోసం రూ. 199 ధరతో ఒక ప్రత్యేక ప్యాకేజీని తీసుకు రానున్నట్లు సమాచారం. ఈ ప్యాకేజీలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రాలకు సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ ఫోటోలు., సినిమా కోసం వారు పడుతున్న శ్రమను వివరించే బిహైండ్ ది సీన్స్ వీడియోలు, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూలు, ప్రేక్షకులకు ఎక్కడా దొరకని కొన్ని ఆసక్తికరమైన 'టెడ్ బిట్స్' వంటి వాటిని ఉంచబోతున్నారు

## కామాక్షి షాకింగ్ డెసిషన్..

## కెరీర్ పీక్‌లోనే నటనకు తాత్కాలిక విరామం

**సినిమా డెస్క్ :** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంట్ కామాక్షి భాస్కర్ల ఊహించని నిర్ణయంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వరుస అవకాశాలతో కెరీర్ జోరుగా సాగుతున్న వేళ, కొంతకాలం పాటు నటనకు మరియు కెమెరాకు దూరంగా ఉండాలని ఆమె ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది.'మా ఊరి పొలిమేర' చిత్రంతో డీ-గ్లామర్ పాత్రలో ప్రేక్షకులను ఆకట్టుకున్న కామాక్షి, ఆ తర్వాత గ్లామరస్ పాత్రలతోనూ తన ప్రత్యేకత చాటుకుంది. సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, ఇటీవల అడివి శేష్ నటించిన 'డెకాయిట్' చిత్రంలోనూ తన నటనతో ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం 'అగధ', 'మా ఊరి పొలిమేర-3' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన కామాక్షి, నటనపై విసుగు వల్ల కాకుండా మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ కోసం ఈ బ్రేక్ తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. జీవితంలో కొన్నిసార్లు మరింత బలం గా ముందుకు సాగేందుకు కాసేపు ఆగి మనసును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంది. తనకు ప్రస్తుతం ప్రశాంతత అవసరమని, ఇది శాశ్వత విరామం కాదని.. మరింత ఉత్సాహంతో తిరిగి వస్తానని తెలిపింది.సినీ పరిశ్రమలో నిరంతర ఒత్తిడి మధ్య వ్యక్తిగత ఆరోగ్యాన్ని ముందుకు పెట్టి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అరుదుగా కనిపిస్తుంటుంది. దీంతో కామాక్షి నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు. ఆరోగ్యం ముఖ్యమని, మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు సోషల్ మీడియాలో మద్దతు తెలుపుతున్నారు.కెరీర్ కంటే మానసిక ప్రశాంతతకే ప్రాధాన్యత ఇచ్చిన కామాక్షి నిర్ణయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. వ్యక్తిగత శ్రేయస్సు కోసం తీసుకున్న ఈ అడుగు, గ్లామర్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# మాజీ సీఎంకు డిప్యూటీ సీఎం నివాళి

- నాదెండ్ల భాస్కర రావు చిత్రపటానికి పుష్పాంజలి
- కుటుంబ సభ్యులను పరామర్శించిన పవన్ కల్యాణ్
- సంతాపం వ్యక్తం చేసిన నాయకులు



**హైదరాబాద్, మే 5:** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నివాళులు అర్పించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ను, కుటుంబ సభ్యులను ఉప ముఖ్యమంత్రి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు సేవలను స్మరించుకుంటూ ఆయన రాజకీయ జీవితాన్ని ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కూడా పాల్గొని నివాళులు అర్పించారు. కార్యక్రమం గౌరవ వాతావరణంలో సాగింది. నాయకులంతా కలిసి కుటుంబ సభ్యులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. మాజీ ముఖ్యమంత్రికి అర్పించిన ఈ నివాళులు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సంతాప వాతావరణాన్ని నెలకొల్పాయి.



## రూ.5.11 లక్షల కోట్ల నాబార్డు రుణ ప్రణాళిక

**ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి, మే 5:** నాబార్డు 2026-27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో రూపొందించిన నాబార్డు క్రెడిట్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. రుణ ప్రణాళిక గతేడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాథమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్ఎంఈలకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

## ప్రజల మనసులు గెలిస్తే మళ్లీ విజయం మనదే

**పార్టీ నేతలతో లోకేశ్ కాఫీ కబుర్లు**



**అమరావతి, మే 5:** ప్రజల మనసులు గెలవండి.. మళ్లీ, మళ్లీ మనల్ని గెలిపిస్తారని తెలుగు దేశం పార్టీ క్లస్టర్లు, ఇన్‌చార్జిలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలో వారితో కాఫీ కబుర్లు పేరుతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్‌దేనని వెల్లడించారు. పనిచేయని వారి పదవులు ఊడతాయని పార్టీ అధినేత హెచ్చరించారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమని ఆయన కుండ బద్దలు కొట్టారు. మనం చేసిన అభివృద్ధి - సంక్షేమం ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశర చేశారు. అహంకారం వీడి సత్ప్రవర్తన, మంచి మాటలతో ప్రజల మనస్సులు గెలవాలంటూ వారికి సూచించారు. తెలుగుదేశం పార్టీ లీడర్లు, కేడర్ సమన్వయం చేసుకుంటూ అనునిత్యం ప్రజలతో మమేకం కావడం ముఖ్యమని వారికి మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీ 151 నుంచి 11సీట్లకు దిగజారడానికి వారి అహంకారమే కారణమని వైసీపీని ఉద్దేశించి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు.





## కలలకు రెక్కలు

**విద్యార్థులకు విమాన ప్రయాణం**

**తొలి విమాన ప్రయాణంతో విద్యార్థుల్లో ఉత్సాహం**

**ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు విద్యార్థుల కృతజ్ఞతలు**

**విజయవాడ, మే 5:** ప్రతిభావంతులైన విద్యార్థులకు కొత్త అనుభవాన్ని అందించే లక్ష్యంతో గన్నవరం విమానాశ్రయానికి ప్రత్యేక పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా విమాన ప్రయాణం చేసే అవకాశం రావడంతో విద్యార్థులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. విమానం ఎక్కే అనుభవం తమకు జీవితంలో మర్చిపోలేని అనుభూతిగా నిలిచిందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కొత్త లక్ష్యాలు, కలలు పెంచే ప్రయత్నం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. కొత్త అనుభవాలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమం విద్యార్థుల కలలకు రెక్కలు ఇచ్చినట్లు భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.




## అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

**ఫిలిప్పీన్స్ కేంద్రంగా ఆన్లైన్ గేమింగ్ ముఠా కార్యకలాపాలు**

**రూ.19.70 లక్షల నగదు సహా పలు వస్తువుల స్వాధీనం**

**అనంతపురం పోలీసుల కీలక ఆపరేషన్**



**అనంతపురం, మే 5:** ఫిలిప్పీన్స్ కేంద్రంగా ఆన్లైన్ గేమింగ్ పేరుతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ ముఠాను అనంతపురం పోలీసులు బట్టబయలు చేశారు. గోప్య సమాచారంతో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఈ ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా ఆన్లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా క్రికెట్ మ్యాచ్‌లపై అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తూ భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. విదేశీ నెట్‌వర్క్‌తో కలిసి పనిచేస్తూ స్థానికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా రూ.19,70,500 నగదు, ఒక కారు, నాలుగు బైకులు, మూడు ల్యాప్‌టాప్‌లు, 15 సిమ్ కార్డులు, 13 ఏటీఎం కార్డులు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక పరికరాల ద్వారా బెట్టింగ్ వ్యవస్థను నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఠాలో ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించి, అంతర్జాతీయ లింకులను కూడా పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతుందని, బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొన్న ఇతరులను కూడా గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్రమ బెట్టింగ్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

## భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

**జలధార - జల హారతి కార్యక్రమంపై మంత్రి**

**నంద్యాల, మే 5:** రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు జలధార - జల హారతి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హనుమంత గుండం చెరువు నుంచి దాదాపు 23 కిలోమీటర్లు కాలువ పొడవున ఉన్న 5 చెరువుల్లో, వాగులు, వంకల్లో మట్టి పూడికతీత పనులను సొంత నిధులతో చేపట్టామని అన్నారు. 3 మీటర్లలోపు భూగర్భ జలాలు వచ్చేలా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. భూగర్భ జలాలు పెరిగితే రైతులంతా తమ బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకునే వీలుంటుందని బీసీ జనార్దన్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం జలహారతి - జలధార కార్యక్రమాన్ని ఒక యజ్ఞం మాదిరిగా చేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# అమరావతి ఆర్థిక ప్రాంతానికి శ్రీకారం

**రాష్ట్ర అభివృద్ధికి భారీ ప్రణాళిక**

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశలో మరో కీలక అడుగు పడుతోంది. రాజధాని కేంద్రంగా మాత్రమే కాకుండా విస్తృత ప్రాంతాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తోంది. అమరావతిని ఆధారంగా చేసుకుని రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన అమరావతి ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తును ప్రభావితం చేసే మార్పులకు దారి తీసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు లక్ష్యం రాజధాని అభివృద్ధికే పరిమితం కాకుండా చుట్టుపక్కల జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం. సుమారు 44,962 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు ఇందులో భాగం కానున్నాయి. ప్రాజెక్టు రూపకల్పన కోసం ఏపీసీఆర్‌డీఏ కన్సల్టెన్సీ సంస్థ ఎంపికకు టెండర్లు ఆహ్వానించారు. నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం పూర్తి ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. ఇందులో ప్రాంతీయ ఆర్థిక వ్యూహాలు, పెట్టుబడుల అవసరాలు, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అమరావతిని కేంద్రంగా తీసుకుని విజయవాడ, గుంటూరు నగరాలను సేవల జంట నగరాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏలూరు, బాపట్ల ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. ఒంగోలు, మార్కాపురం ప్రాంతాలను ఖనిజ, తయారీ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ప్రణాళిక ఉంది. మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం, కాకినాడ ప్రాంతాల్లో ఓడరేవు ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీంతో ఎగుమతులు పెరగడంతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. భవిష్యత్ రంగాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, రక్షణ, ఏరోస్పేస్, ఔషధ తయారీ, సెమీకండక్టర్ డిజైన్, ఎలక్ట్రిక్ వాహన భాగాల తయారీ వంటి రంగాలను ప్రధానంగా గుర్తించారు. ఈ ప్రణాళికను దశలవారీగా అమలు చేయనున్నారు. 2030, 2035, 2047 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందిస్తున్నారు. 2047 నాటికి ఈ ప్రాంతాన్ని 250 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యంగా ఉంది. భూమి సమీకరణ, మౌలిక వసతుల విస్తరణ, పట్టణ ప్రణాళిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే ఉన్న భూములను వినియోగించుకోవడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త భూములను గుర్తించి ల్యాండ్ పూలింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందిస్తున్నారు. సింగపూర్, టోక్యో, సియోల్ నగరాల అభివృద్ధి నమూనాలను పరిశీలిస్తున్నారు. దేశీయంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, ఢిల్లీ ఎన్సీఆర్



నమూనాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుకు ఆర్థిక, సాంకేతిక సహకారం కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు సహకారం తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రీ-ఫీజిబిలిటీ నివేదికలను సిద్ధం చేయనున్నారు.